ప్రజలను భాగస్వామ్యం చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్, జూన్ 24 : ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ ఫామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఆయిల్‌పామ్, ఎరువులు, భూ భారతి వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వనమహోత్సవంలో మొక్కలు పెద్దఎత్తున నాటాలని కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాన్ని చూడాలని పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. భూ భారతి ద్వారా 11802 దరఖాస్తులు స్వీకరించామని, 7583 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం టీ.బీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీ.బీ నియంత్రణ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న హిందూవాహిని సభ్యులు

బొట్టు పెట్టుకొచ్చాడని..

- యువకుడిపై దాడికి పాల్పడిన ఎస్ఐ
- హిందూవాహిని ఆధ్వర్యంలో పీఎస్ ఎదుట ధర్నా
- ఎస్ఐ అబ్దుల్ రవూఫ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్
- జరిగిన ఘటనపై విచారణ చేపడతాం : సీఐ శ్రీధర్‌రెడ్డి

బొంరాస్‌పేట, జూన్ 24 : వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో బొట్టుపై రగడ జరిగింది. పోలీస్‌స్టేషన్‌లోకి బొట్టు పెట్టుకొని ఎందుకు వచ్చావని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తనపై దుర్భాషలాడుతూ దాడికి దిగాడని ఓ యువకుడు హిందూవాహిని ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. మండల పరిధిలోని ఎనికేపల్లి గ్రామానికి చెందిన రవీంద్రాచారి సోమవారం ఒక పత్రికలో సీఎంపై యాంటీగా వచ్చిన వార్తను తన ఫోన్‌లో స్టేటస్ పెట్టి కొన్ని గ్రూపుల్లో షేర్ చేశాడు. దీనిపై ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తనని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ముఖ్యమంత్రిపై వచ్చిన వార్తను వైరల్ చేస్తావా అంటు దుర్భాషలాడుతూ బొట్టు పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌లోకి వస్తావా అని తనపై దాడికి దిగాడని ఆరోపిస్తూ బుధవారం స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్, కొడంగల్ ఎస్ఐ సత్యనారాయణ ధర్నా దగ్గరకు చేరుకున్నారు. సీఐ జరిగిన సంఘటనపై బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. నిజానిజాలు తెలుసుకొని తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్టేషన్ ఎదుట ధర్నాను పోలీసులు విరమించే ప్రయత్నం చేయగా హిందూవాహిని సభ్యులు రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శ్రావణ్‌గౌడ్, బాబయ్య నాయుడు మాట్లాడుతూ.. పోలీసులు ఒక వర్గానికి కాకుండా ప్రజల పక్షాన ఉండి అందరికీ న్యాయం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని గుర్తుచేశారు. చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లే పోలీసులే చట్ట వ్యతిరేక పనులు చేయడం సరికాదన్నారు. ఎస్పీ నారాయణరెడ్డి స్పందించి వెంటనే ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడతామని వారు హెచ్చరించారు.

'రైతు నేస్తం' ఒక రాజకీయ డ్రామా..

బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

వికారాబాద్, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లు రైతులను మోసం చేసి ఇప్పుడు 'రైతు నేస్తం' కార్యక్రమం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎప్పుడూ ఎక్కడా లేని విధంగా దేశానికి అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు పెట్టి, చేతులకు బేడీలు వేసినందుకా..? పంట బీమా అని చెప్పి మోసం చేసినందుకా.. అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ఉంటే 10,000 ఇస్తారు.. తమ ప్రభుత్వం రాగానే 15,000 ఇస్తామని హామీ ఇచ్చి, రైతు భరోసాను ఎకరాకు 12,000లకు మాత్రమే పరిమితం చేసినందుకా? అది కూడా సక్రమంగా వెయ్యకుండా రెండుసార్లు (వానకాలం, యాసంగి) ఎగ్గొట్టి ఎదురు చూసిన రైతుల ఆశలపై నీళ్లు చల్లినందుకా..అని ప్రశ్నించారు. రుణమాఫీ డబ్బులు మీ ఖాతాల్లో జమ చేశామని మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకరి తర్వాత ఒకరు మీడియా సమావేశాలు పెట్టి, ఆశలు రేపి, బ్యాంకుల చుట్టూ తిప్పితిప్పి వెయ్యకుండా ఎంతో మంది రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పండించి, విక్రయించిన పొద్దుతిరుగుడు ధాన్యం డబ్బులు చెల్లించడంలో విఫలమైనందుకా? అన్ని రకాలుగా మోసం చేసి, రైతు ఆత్మస్థైర్యం దెబ్బతీసినందుకా.. అని అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు సంబురాలు? ఎవరి కోసం? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతు ఎక్కడా సంతోషంగా లేడన్నారు. వారికి మీరు చేసింది సున్నా. ఇప్పుడు కొత్తగా సంబురాలు ఎందుకు..? రైతులను మోసం చెయ్యటం తప్ప వారి కోసం ఏం వెలగబెట్టారని ప్రశ్నించారు. మీరు రైతులకు ఎంతో చేసాం అని.. ఇప్పుడు ఓట్ల కోసం గొప్పలు చెప్పుకొంటూ విజయోత్సవాలు, సంబురాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది మీ ప్రభుత్వం చేస్తున్న కొత్త రకం మోసం. ఇప్పటివరకు రైతులకు చేసిన మోసాలు చాలు.. మీకు చేతనైతే క్షమాపణలు చెప్పి, రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే సంబురాలు నిర్వహించడానికి గ్రామాల్లోకి వెళ్లి రైతులను రమ్మని కోరాలన్నారు. రైతులు, ప్రజలకు మీరు చేసిన మోసాలకు గాను మీరు గ్రామాల్లోకి ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తూ ఉన్నారన్నారు. పొరపాటున మీరు గ్రామాల్లోకి వెళ్తే మీ వైఫల్యాలు, మీరు చేసిన మోసాలకు మిమల్ని తరిమితరిమి కొడతారన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే సర్కారుకు వణుకు పుడుతున్నదని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మీ నాయకులను తరిమికొట్టి, ఓటు అనే ఆయుధంతో మీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

విత్తనాల కోసం పడిగాపులు

బంట్వారం, జూన్ 24 : సకాలంలో రైతులకు విత్తనాలు అందక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం మండల కేంద్రంలో అన్నదాతలు ఉదయం నుంచి విత్తనాల కోసం పడిగాపులు కాశారు. అయినా విత్తనాలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. స్థానిక ఏవో శ్రావ్య సోమవారం కొంతమంది రైతులకు కంది విత్తనాలను అందజేశారు. విత్తనాల సరఫరాలో అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో విత్తనాలు అందడంలో ఆలస్యమవుతున్నది. మండలవ్యాప్తంగా అన్నదాతలు ఎక్కువగా కంది పంటనే పండిస్తారు. అధికారుల అంచనా మేరకు మండలానికి సుమారు 800 బస్తాల విత్తనాలు అవసరమున్నాయి. సోమవారం నాటికి అధికారులు 150 బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. దీంతో వచ్చిన రైతులు ఎగబడి తీసుకోవడంతో మధ్యాహ్నానికి అయిపోయాయి. మంగళవారం సైతం 20 బస్తాలే సరఫరా చేయగా అన్నదాతలకు ఎన్నివ్వాలో తెలియక అధికారులు తలలుపట్టుకున్నారు. విత్తనాల కోసం ఉదయం 10 గంటలకే వచ్చి కార్యాలయం వద్ద కూర్చున్న రైతులకు సైతం విత్తనాలు అందలేదు. దీంతో అన్నదాతలంతా అధికారుల తీరుపై మండిపడుతూ వెనుదిరిగారు. సుమారు 100 మంది రైతులు రైతు వేదిక వద్దకు రాగా సరిపడా విత్తనాలు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. విత్తనాలు సరఫరా చేసే డీలర్లు సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఈ సమస్య నెలకొందని ఏవో శ్రావ్య పేర్కొంటున్నారు. ఇప్పటికే విత్తనాలు విత్తే సమయం దగ్గర పడింది. విత్తనాలను ఆలస్యంగా సరఫరా చేయడంతో అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్నదాతలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఉదయం 10 గంటలకే రైతు వేదిక వద్ద విత్తనాల కోసం వేచి చూస్తున్న అన్నదాతలు

ఆన్‌లైన్ గేమ్స్‌తో ఆస్తులు ఖాళీ!

సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఆకర్షితులవుతున్న యువత

బెట్టింగ్ మోజులో పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న వైనం

కొంతమంది బయటకు చెప్పకోలేక సతమతం

చైన్ మార్కెటింగ్‌తోనూ మోసాలు

ఆదిబట్ల, జూన్ 24 : ఈజీ మనీ.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలామంది ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆన్‌లైన్ వేదికగా సాగుతున్న కార్యకలాపాల్లో లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, యువత, విద్యార్థులు స్మార్ట్ ఫోన్లో అనేక రూపాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. చాలామందికి ఇవి నష్టాలే తెస్తున్నా సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో వేలాదిమంది ఆకర్షితులవుతున్నారు. ఇలాంటి ప్రకటనలు, ఆన్‌లైన్ మోసాల బారిన పడద్దని పదేపదే పోలీసులు సూచిస్తున్నారు.

బెట్టింగ్ యాప్‌లు

బెట్టింగ్ మోజులో పడి చాలామంది యువత తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిబట్ల, యాచారం, మంచాలలాంటి ప్రాంతాల్లోనూ అనేకమంది ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో బెట్టింగ్ పెట్టారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో యువత పేకాటతో పాటు ఆన్‌లైన్ గేమ్ ఆడి నష్టాల ఊబిలో చిక్కుకుంటున్నారు.

ఆన్‌లైన్ యాప్స్, గేమ్స్

ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడితే డబ్బులు వస్తాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో అనేకమంది డబ్బులు పెట్టి ఆడుతున్నారు. విద్యార్థులతోపాటు ఉద్యోగస్తులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పలు యాప్‌లతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరుపుతున్నారు. ఈ మధ్యకాలంలో ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతూ లక్షల రూపాయలను పోగొట్టుకున్నారు.

బయటికి చెప్పుకోలేక..

ఆన్‌లైన్ మోసాల బాధితులు చాలామంది బయటకు చెప్పుకోలేకపోతున్నారు. సైబర్ నేరాల్లో మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. తెలిసి పెట్టుబడులు పెట్టి కోల్పోయిన ఘటనల్లో ఎవరూ బయటకు రావడంలేదు. గత కొన్ని రోజుల క్రితం స్థానికంగా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి ప్రకటనల్లో చూపినట్లుగా డబ్బులు రాలేదని నిర్వాహకులను అడిగితే అక్కడి నుంచి సమాధానం రాలేదు. తాను ఓ ప్రభుత్వ ఉద్యోగి కావడంతో సమాజంలో పరువు పోతుందని ఆయన ఎక్కడా ఫిర్యాదూ ఇవ్వలేదు. ఆన్‌లైన్ మోసాల బారిన పడి బయటకు చెప్పుకోకుండా కుమిలిపోతున్నవారు ఎంతోమంది ఉన్నారు.

ఆశతో మోసపోతున్నారు

చాలామంది యువకులు, విద్యార్థులు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ యాప్‌లకు అలవాటుపడ్డారు. బెట్టింగ్ గేమ్స్ ఆడుతూ ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ గేమ్స్, యాప్స్ పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్తపడాలి. ఎంతోమంది నష్టపోయి బయటకి చెప్పుకోలేకపోతున్నారు. - రాఘవేందర్‌రెడ్డి, ఆదిబట్ల సీఐ

చైన్ మార్కెటింగ్‌తోనూ మోసాలు

ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చు, తమ ఉత్పత్తులను ప్రచారం చేసి పెట్టుబడి కూడా పెట్టవచ్చు అంటూ చేసే ప్రచారంతో నష్టపోతున్నారు. చైన్, ఆన్‌లైన్ మార్కెటింగ్ తదితర వాటితోనూ దెబ్బతింటున్నారు. ఒకరిని చేర్పించి మరొకరిని చేర్పిస్తే డబ్బులు వస్తాయంటూ ఆశ చూపుతున్నారు. మొదట కొందరికి డబ్బులు వచ్చేలా చేసి ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. గతంలో జిల్లాలో ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి.

మిషన్ భగీరథ

పైప్‌లైన్ ధ్వంసం

ఐదు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

మొయినాబాద్, జూన్ 24 : హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి సంబంధించిన బైపాస్ రోడ్డు పనులను మొయినాబాద్ నుంచి సురంగల్‌కు వెళ్లే దారిలో నిర్వహిస్తున్నారు. బైపాస్ వెళ్తున్న ప్రాంతం నుంచి మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా ముర్తుజాగూడ, సురంగల్, శ్రీరామ్‌నగర్ గ్రామాలకు మంచినీటి సరఫరా చేస్తారు. ఐదు రోజుల క్రితం రాత్రి సమయంలో ఇటాచీతో పనులు చేస్తూ మిషన్ భగీరథ పైప్ లైన్‌ను ధ్వంసం చేశారు. పైపు పగిలిపోవడంతో రోడ్డు కోసం తవ్విన గుంతలు పూర్తిగా నిండాయి. ఐదు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయిన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజాగూడ, సురంగల్ గ్రామాలకు మున్సిపల్ కమిషనర్‌గానీ, మొయినాబాద్ మండల పరిధిలో ఉన్న శ్రీరాంనగర్ గ్రామాన్ని పంచాయతీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో నీటి సరఫరా చేస్తున్న వాటర్‌మెన్ ప్రజలకు అవసరమున్న నీటిని వదలడంలో ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాటర్‌మెన్ సైతం ఎవరికి చెప్పాలో అర్థం కాని స్థితిలో వారు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసి మంచినీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతు భరోసా విజయోత్సవాలు

రైతు భరోసా విజయోత్సవాల్లో భాగంగా సచివాలయం నుంచి రాష్ట్రంలోని 1031 రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో రైతు పండుగను ఉద్దేశించి రాష్ట్ర మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రైతు భరోసా, రైతుల రుణమాఫీపై రైతులతో సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులతో కలిసి సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ రైతులకు స్ప్రింక్లర్లను అందజేశారు. మోమిన్‌పేటలోని రైతు వేదికలో స్పీకర్, కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో విజయలక్ష్మి అధికారులు సీఎం, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల సందేశాలను వీక్షించారు.

- వికారాబాద్, జూన్, 24

జల్సాలకు అలవాటుపడి..

కన్నతల్లికి చెందిన 20 తులాల బంగారు నగలతోపాటు ఐఫోన్, కొంత నగదు చోరీ

ఆదిబట్ల, జూన్ 24 : జల్సాలకు అలవాటుపడి కన్నతల్లి చెందిన బంగారు నగలతోపాటు కొంత నగదును ఎత్తుకెళ్లి వచ్చిన డబ్బులతో బెట్టింగులకు ఖర్చు చేయడంతో తల్లి ఫిర్యాదుతో కొడుకుని అదుపులోకి తీసుకొని ఆదిబట్ల పోలీసులు విచారణ చేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని తుర్కయాంజాల్‌కు చెందిన సోమ రౌతు శ్రీలక్ష్మి భర్త చనిపోయాడు. ఆమె పెద్ద కొడుకు రాజేశ్ హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నాడు. చిన్న కొడుకు హరికృష్ణ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏప్రిల్ 4న హరికృష్ణకు వివాహం కుదిరింది. దీంతో శ్రీలక్ష్మి వివాహానికి అమెరికా వెళ్లింది. రాజేశ్ ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగానికి వెళ్తుండేవాడు. శ్రీలక్ష్మి తనకున్న 20 తులాల బంగారు ఆభరణాలతోపాటు ఐఫోన్, కొంత నగదును తన రూమ్‌లో ఉన్న బీరువాలో పెట్టి తాళం వేసి వెళ్లింది. తిరిగి శ్రీలక్ష్మి జూన్ 19న అమెరికా నుంచి తిరిగి తుర్కయాంజాల్‌కు వచ్చింది. తన రూమ్ లోకి వెళ్లి బీరువాని తెరిచి చూడగా బంగారు నగలతోపాటు నగదు, ఐఫోన్ కనిపించకపోవడంతో వెంటనే ఈ నెల 23న ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

రాజేశ్ గత కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. తల్లి తమ్ముడి పెళ్లికి అమెరికా వెళ్లడంతో తల్లి గదితాళాలు పగులగొట్టి అందులో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలతోపాటు ఐఫోన్, కొంత నగదును ఎత్తుకెళ్లాడు. వాటిని విక్రయించి వచ్చిన నగదుతో బెట్టింగులు ఆడానని పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు తెలిసింది. గత నాలుగు రోజులుగా రాజేశ్‌ను ఆదిబట్ల పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని బంగారు ఆభరణాలతోపాటు ఐఫోన్‌ను రికవరీ చేసినట్లు తెలిసింది. విచారణలో రాజేశ్ దోషిగా తేలడంతో కుటుంబసభ్యులు అవాక్కయ్యారు.

నినాదాలు చేస్తున్న పోలీస్ అకాడమీ–మన్నెగూడ హైవే సాధన సమితి నాయకులు

పనులు వెంటనే ప్రారంభించాలి

పోలీస్ అకాడమీ–మన్నెగూడ హైవే సాధన సమితి నాయకులు

పరిగి, జూన్ 24 : పోలీస్ అకాడమీ–మన్నెగూడ జాతీయ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని పోలీస్ అకాడమీ–మన్నెగూడ హైవే విస్తరణ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. పోలీస్ అకాడమీ–మన్నెగూడ నేషనల్ హైవే విస్తరణ సాధన సమితి ఆధ్వర్యంలో పరిగి సమీపంలోని సయ్యద్ మల్కాపూర్‌లోని ఓ పాఠశాలలో పరిగి నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్ అకాడమీ–మన్నెగూడ వరకు గల నేషనల్ హైవే పనులు జరగకపోవడం వల్ల అనారోగ్యంతో ఉన్న వాళ్లను మెరుగైన వైద్యం కోసం రాజధాని నగరానికి తీసుకువెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ రహదారిలో నిత్యం 17వేల పైచిలుకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, రోడ్డు విస్తరణ జరగక ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు.

కుంటుపడుతున్న అభివృద్ధి

పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్, చేవెళ్ల నియోజకవర్గాల్లో అభివృద్ధి కుంటుపడడమేకాకుండా ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్న ఎంతోమంది యువత, రైతులు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం వల్ల ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తే తప్ప జాతీయ రహదారి నిర్మాణం జరిగేలా లేదన్నారు. రాజధాని నగరానికి కూతవేటు దూరంలో ఉన్నా రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడం, అనేక సాకులతో సంవత్సరాలుగా సాగదీస్తున్నందుకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు సిగ్గుతో తలదించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ప్రజాప్రతినిధులపై ఈ ప్రాంత వాసులందరూ కలిసి ఒత్తిడి తీసుకురావడానికి దశలవారీగా పోరాటం చేస్తూ నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు, మంత్రులు, స్పీకర్, సీఎం వరకు తెలిసేలా పోరాటం కొనసాగిద్దామన్నారు. పరిగి నియోజకవర్గంలో ఈ నెల 27న భారీ ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి, ఎమ్మెల్యే పాల్గొనేలా చూడాలని వారు నిర్ణయించారు.

హరితహారం చెట్లు నరకడంపై మున్సిపల్ అధికారులు సీరియస్

విద్యుత్ శాఖ అధికారులు నరికిన చెట్లు

వికారాబాద్, జూన్ 24 : వికారాబాద్ పట్టణంలో పచ్చదనాన్ని పెంచి స్వచ్ఛమైన వాతావరణం అందించాలనే మంచి ఆలోచనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా మూడు సంవత్సరాల క్రితం కొత్త కలెక్టరేట్ నుంచి కొత్రేపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో వికారాబాద్ మున్సిపాలిటీకి అవార్డు కూడా వచ్చింది. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి నీరు పోసే కార్యక్రమాన్ని చేపట్టారు. అవి ఏపుగా పెరిగి పచ్చని వాతావరణంతో కళకళలాడాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకడంతో విద్యుత్ శాఖ అధికారులు చెట్లను నరికివేస్తున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు చెట్లను నరికివేయకూడదని నోటీసులు జారీ చేశారు. చెట్లను కాకుండా చెట్ల కొమ్మలు మాత్రమే తొలగిస్తే సరిపోతుందన్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హరితహారం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పచ్చని వాతావరణం ఏర్పాటుకు అధికారులు కృషి చేస్తుంటే.. విద్యుత్ శాఖ అధికారులు చెట్లను పూర్తిగా నరికివేయడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారు.

రెండు రోజుల్లో మోస్తరు వానలు

సిటీబ్యూరో, జూన్ 24, (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. షేక్‌పేట్ లో 3.3 మిల్లీమీటర్లు, పఠాన్‌చెరు ఎంఆర్ఓ కార్యాలయం ప్రాంతంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం మంగళవారం రాత్రి వరకు నమోదైంది. ఈ ఆవర్తనం మరింత బలపడే అవకాశముండడంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలు, గాలిలో తేమ 75శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

మొయినాబాద్, జూన్ 24 : మేడిపల్లి గ్రామానికి చెందిన సాలె రమేశ్(35) భార్య అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతిచెందింది. భార్య మృతిని తట్టుకోలేని రమేశ్ తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నెల 22న ఉదయం 8:30కి రమేశ్ తండ్రి యాదయ